తెలంగాణ
# ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు

www.telanganaprajavaradhi.com

తెలుగు దినపత్రిక





హైదరాబాద్ | బుధవారం | 01 - 04 - 2026 | ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి | పేజీలు : 5





## ఎస్సీ, ఎస్టీల శ్రేయస్సు కోసమే
# పౌరహక్కుల కార్యక్రమం

**ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ జిల్లా కమిటీ మెంబర్ దాసరి తిరుమలేష్**

ప్రజావారధి/మోత్కూరు

ఎస్సీ, ఎస్టీల హక్కులు, శ్రేయస్సు కోసమే ప్రభుత్వం పౌరహక్కుల కార్యక్రమం నిర్వహిస్తుందని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ జిల్లా కమిటీ మెంబర్ దాసరి తిరుమలేష్ అన్నారు. మోత్కూర్ మండలం ముశిపట్ల గ్రామంలో మంగళవారం ఆర్ఐ కాసోజు రవి అధ్యక్షతన పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకతీతంగా గ్రామంలో ప్రజలంతా కలిసి ఉండాలని కోరారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ప్రభుత్వం నుంచి అందాల్సిన డబ్బులు ఆలస్యం చేయకుండా వెంటనే అందించాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు ఇవ్వాల్సిన పరిహారాన్ని ప్రభుత్వం వెంటనే అందించాలన్నారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలు తమ న్యాయమైన పనులపై తమ దగ్గరకు వస్తే అధికారులు ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని, ఎస్సీ, ఎస్టీ కేసుల్లో రాజీ కుదుర్చుకోవద్దని, న్యాయపరంగానే పోరాడాలని, తప్పుడు కేసులు నమోదు చేయవద్దని కోరారు. అనంతరం ఆర్ఐగా పదోన్నతి పొందిన కాసోజు రవిని సన్మానించి శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పైళ్ల నర్సిరెడ్డి, ఉపసర్పంచ్ నోముల అంజయ్య, ఎస్ఐ సతీష్, ఏఎస్ఐ శ్రీనివాస్, ఏపీవో జనార్దన్ రెడ్డి, ఏఆర్ఐ రవీంద్రాచారి, ఏపీఎం పక్కీరయ్య, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, జీపీవో ప్రవీణ్, సీసీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- ఉద్యోగ భద్రత కల్పించి రూ.18 వేల వేతనమివ్వాలి
- సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు

ప్రజావారధి/మోత్కూరు

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించడంతో పాటు ప్రభుత్వం ఎన్నికల ముందు ఆశావర్కర్లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీపీఎం మోత్కూరు మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఆశావర్కర్లకు కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరెండ్లు అవుతున్నా వారిని పట్టించుకోకపోవడంతోనే ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారిని



నిర్బంధించి ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడి ఆశావర్కర్లకు నెలకు ఫిక్స్డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం పెంచిన రూ.1500 పారితోషికాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
బుధవారం
జనరల్ న్యూస్
01 - 04 - 2026


# స్నేహితురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామానికి చెందిన ఎస్ఎస్‌సీ బ్యాచ్ స్నేహితురాలు మహాలక్ష్మి తల్లిదండ్రులు జినుకల చంద్రయ్య, వీరమల్లమ్మ మృతి చెందగా తోటి స్నేహితులు అండగా నిలిచారు. దత్తప్పగూడెం హైస్కూల్ 2009-10 ఎస్ఎస్‌సీ బ్యాచ్ స్నేహితులు మంగళవారం మహాలక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.14 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు తొంట నరేష్, ఎర్నానిపల్లి సందీప్, వంగూరి శ్రీకాంత్, బొడ్డు మహేష్, ముకెర్ల లక్ష్మణ్, వంగూరి మల్లేష్, బుశిపాక బుగ్గరాములు, మధన్ జోసెఫ్, మహ్మద్ గౌస్, ఎలుగు సత్యనారాయణ, పజ్జూరి నర్మద, కొసన సైదులు, వంగూరి గణేష్, పబ్బు మత్స్యగిరి, కడిగళ్ల మమత, జినుకల నరేష్, అల్లూరి లావణ్య, నోముల సరోజన, వరికుప్పల విజయ, మేడి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని 8వ వార్డు అంగడిబజార్‌లో ఏర్పాటు చేసిన 100కేవీ నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్నసోమనర్సయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరెంట్ లోఓల్టేజ్ సమస్య తలెత్తకుండా ప్రభుత్వం నూతన 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిందని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో ఈ ప్రాంతంలో ఇకముందు లోఓల్టేజీ సమస్య ఉండదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గృహజ్యోతి పథకంలో అర్హులైన వారందరికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తుందని, దాంతో పేదలకు కొంత డబ్బు ఆదా అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పన్నాల శ్రీవిద్యశ్రీనివాస్ రెడ్డి, బీసు శ్రీకాంత్, కారుపోతుల వెంకన్న, మున్సిపల్ కమిషనర్ కె.సతీష్‌కుమార్, ట్రాన్స్‌కో ఏడీఈ బాలునాయక్, ఏఈ ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు గడ్డం సోమనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



# జబర్దస్త్ కమెడియన్ ప్రవీణ్ జన్మదిన వేడుకలు



ప్రజావారధి/మోత్కూరు

జబర్దస్త్ కమెడియన్ పటాస్ ప్రవీణ్ జన్మదిన వేడుకలను మంగళవారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. మోత్కూరు వచ్చిన ఆయనకు కాలనీవాసులు ఘన స్వాగతం పలికి కేక్ కట్ చేయించి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించి శుభాకాంక్షలు చెప్పారు. శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ జిల్లా మెంబర్ దాసరి తిరుమలేష్ మాట్లాడుతూ పటాస్ ప్రవీణ్ సినీ ఇండస్ట్రీలో పెద్ద స్టార్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాలనీ యువకులు పాల్గొన్నారు.

# పెన్షనర్లకు త్వరలో డిజిటల్ ఆరోగ్యకార్డులు





ప్రజావారధి/మోత్కూరు

రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లకు త్వరలో డిజిటల్ ఆరోగ్యకార్డులు జారీ చేస్తుందని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డి.నర్సింహారెడ్డి తెలిపారు. ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మోత్కూర్ యూనిట్ కార్యాలయంలో మంగళవారం మార్చిలో పుట్టినరోజు జరుపుకున్న 8మంది రిటైర్డ్ ఉద్యోగుల సామూహిక జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో కేక్ కట్ చేయించి సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిజిటల్ ఆరోగ్య కార్డులకు సంబంధించి ప్రభుత్వం విధివిధానాలు రూపొందిస్తుందని, త్వరలోనే ప్రభుత్వ ఉత్తర్వులు కూడా వెలువడుతాయన్నారు. డిజిటల్ ఆరోగ్యకార్డులతో రిటైర్డ్ ఉద్యోగులు ఆస్పత్రుల్లో నగదు రహిత చికిత్స పొందడానికి వీలవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మోత్కూరు యూనిట్ అధ్యక్షుడు బి.యాదిరెడ్డి, జిల్లా కార్యదర్శి అవిశెట్టి అవిలిమల్లు, యూనిట్ కార్యదర్శి వల్లభాయి, ఉపాధ్యక్షులు టి.మనోహరాచారి, ఎస్.యాదగిరిలక్ష్మి, కోశాధికారి వారాల యాదగిరి, జిల్లా ప్రతినిధులు ఎస్.భాస్కరాచారి, ఎ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
01 - 04 - 2026



## మోత్కూరు సింగిల్‌విండోలో..


# ఉద్యోగుల మందు పార్టీ

- ఆఫీస్‌లోనే తప్పతాగి తందనాలు ఆడుతున్న ఉద్యోగులు
- ఫొటోలు, వీడియోలు తీసిన రిపోర్టర్‌కు బెదిరింపులు

## చైర్మన్ ఛాంబర్‌నే సిట్టింగ్ రూంగా మార్చిన వైనం

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు రైతుసేవా సహకార సంఘం కార్యాలయాన్ని(సింగిల్‌విండో) ఉద్యోగులు సిట్టింగ్ రూంగా మార్చి మందు పార్టీ చేసుకున్నారు. ఏకంగా చైర్మన్ ఛాంబర్‌లోనే దుకాణం తెరిచి మందు తాగారు. మంగళవారం అర్ధరాత్రి వరకు మోత్కూరు సింగిల్ విండో కార్యాలయం తెరిచి ఉంచి యధేచ్ఛగా కార్యాలయంలోనే నలుగురు ఉద్యోగులు మందు తాగుతున్నారు. మోత్కూరు సింగిల్ విండో కార్యాలయ ఉద్యోగులతో పాటు నల్లగొండ గ్రామీణ సహకార బ్యాంక్ మోత్కూరు బ్రాంచ్ ఉద్యోగి పృధ్వి, అడ్డగూడూరు సింగిల్‌విండో కంప్యూటర్ ఆపరేటర్ శివతో కలిసి నలుగురు ఉద్యోగులు మందు తాగుతున్న వారిలో ఉన్నారు. విధులు ముగించుకుని కార్యాలయం మూసేసి వెళ్లాల్సిన ఉద్యోగులు ఇలా కార్యాలయంలోనే మందు పార్టీ చేసుకోవడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు చైర్మన్ ఛాంబర్‌కు ఏమాత్రం విలువ ఇవ్వకుండా చైర్మన్ టేబుల్‌పై మందు బాటిళ్లు, బజ్జీలు పెట్టుకుని తాగుతున్నారు. విషయం తెలిసి అక్కడకు వెళ్లిన రిపోర్టర్ ఫొటోలు, వీడియోలు తీస్తుండగా..ఫొటోలు, వీడియోలు తీసి ఏం చేసుకుంటావ్..ఎవరికి చెప్పు కుంటావో చెప్పుకోమంటూ రిపోర్టర్‌పై బెదిరింపులకు దిగారు. పాలకవర్గాలు లేకపోవడం, ఉద్యోగులపై అజమాయిషీ లేకపోవడంతోనే ఇలా బరితెగించి కార్యాలయంలోనే మందు పార్టీలు



చేసుకుంటున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సింగిల్‌విండో కార్యాలయం చైర్మన్ ఛాంబర్‌లోనే మందు పార్టీ చేసుకున్న ఉద్యోగులపై ఉన్నతాధికారులు ఏం చర్యలు తీసుకుంటారో చూడాలి.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
01 - 04 - 2026

# రైస్ మిల్లులను పట్టణానికి దూరంగా తరలించాలి



**ప్రజావారధి/మోత్కూరు**

మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో ఉన్న రైస్‌మిల్లులతో కాలుష్యం ఏర్పడి ప్రజలు అనారోగ్యాల భారిన పడుతున్నారని, రైస్ మిల్లులను పట్టణానికి దూరంగా తరలించాలని డిఫెన్స్ వినియోగదారుల హక్కుల సంఘం అధ్యక్షులు గుమ్మిడేల్లి పరశురాములు కోరారు. మంగళవారం ఆయన మోత్కూరు మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్నసోమనర్సయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కేంద్రంలో ఉన్న పరమేశ్వర, ధనలక్ష్మి, రామకృష్ణ, శ్రీనివాస, గణేష్ రైస్ మిల్లుల నుంచి విపరీతమైన కాలుష్యం వస్తుందని, నీరు కలుషిత మవుతుందని, దుమ్ము, దుర్వాసనతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. పట్టణంలో ఉన్న రైస్ మిల్లులతో ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడే ప్రమాదమున్నం దున వాటిని పట్టణానికి దూరంగా తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

# రేపు మోత్కూర్ నియోజకవర్గ సాధన సమితి ప్రత్యేక సమావేశం

**ప్రజావారధి/మోత్కూరు**

మోత్కూరు నియోజకవర్గం ఏర్పాటు కోసం గురువారం మోత్కూర్ నియోజకవర్గ సాధన సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని ఎల్ఎన్ గార్డెన్‌లో మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ఉంటుందని, సమావేశానికి మోత్కూర్, గుండాల, ఆత్మకూర్(ఎం), అడ్డగుడూర్ మండలాలకు చెందిన అన్ని రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు, ప్రముఖులు, యూత్, విద్యార్థి, ఉద్యోగ, మహిళా సంఘాల, స్వచ్ఛంద సంస్థలు, మీడియా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మోత్కూరు నియోజకవర్గ సాధన నూతన కమిటీ ఎన్నికతో పాటు, భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్టు చెప్పారు.